

## సీపీని కలిసిన వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా ను ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, వరంగల్ వాయిస్ దిన పత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

**- వరంగల్ వాయిస్, క్రైం**


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 101 సోమవారం | 16 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


# అరచేతిలో వైకుంఠం



## పంపకాలే ప్రజా సమస్యలా..?

### పోటీ పడి తాయిలాల ప్రకటన

### డబ్బుల పందేరంలో హామీల వర్షం

### అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హీటెక్కుతున్న రాజకీయం

ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. ఓటర్లను మభ్య పెట్టేలా అరచేతిలే వైకుంఠం చూపిస్తున్నారు. కాంగ్రెస్ ఒకటి చేస్తానంటే.. నేను రెండు చేస్తానంటూ బీఆర్ఎస్ ప్రకటన చేసింది. రేపు బీజేపీ మరో అడుగు ముందుకేసి మూడు చేస్తానంటూ ప్రకటిస్తుంది. గమ్మత్తేంటంటే అన్నీ కూడా తాయిలాలే తప్ప ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ఉపయోగపడే పనులేవీ లేవు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మేనిఫెస్టోలు చూస్తే వీరు అధికారం కోసం తెలంగాణను అమ్మడానికి కూడా వెనకాడరని అర్థం అయ్యింది. ఓటర్లను ఏమార్చడమెలా అన్న విషయాన్ని ఈ రెండు పార్టీలు బాగా వంటబట్టించుకున్నట్లు అర్థమవుతోంది. పంపకాలే ప్రజా సమస్యలుగా గుర్తించిన మహానేతలు వీరు. ఒకరిని మించి మరొకరు ప్రజలకు డబ్బులు పందేరం చేయడంలో పోటీ పడేలా హామీలు గుప్పించారు. ఈసారి ఎన్నికల్లో పోటీ హెూరాహెూరీ ఉంటుందని సర్వేలు చెబుతున్న సమయంలో ఎవరికి వారు అధికారం చేజిక్కించుకునేందుకు తాయిలాలనే ఆయుధాలుగా వాడుతున్నారు. **- వరంగల్ వాయిస్ ప్రతినిధి**




వివరాలు 2లో..



8లో

## అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు

## హైవేలపై దోపిడీ ముఠా అరెస్ట్

### పోలీసుల అదుపులో ముగ్గురు



2లో..



8లో

## మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగింది

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

ప్రారంభమైన ప్రజా ఆశీర్వాదయాత్ర

# అరచేతిలో వైకుంఠం




**పంపకాలే ప్రజా సమస్యలా..?**
**పోటీ పడి తాయిలాల ప్రకటన**
**డబ్బుల పందేరంలో పోటీ పడేలా హామీలు**
**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హీటెక్కుతున్న రాజకీయం**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ హెూరాహెూరీ ఉంటుందని సర్వేలు చెబుతున్న తరుణంలో తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గెలుపే లక్ష్యంగా అదిరిపోయే మేనిఫెస్టోను విడుదల చేశారు. సంక్షేమ పథకాలే లక్ష్యంగా రూపొందించిన మేనిఫెస్టోతో ఓటర్ల ముందుకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికి రెండుసార్లు విజయం సాధించి అధికారం చేపట్టిన కేసీఆర్ హ్యాట్రిక్ లక్ష్యంగా సంక్షేమ మేనిఫెస్టును రూపొందించారని అర్థం చేసుకోవచ్చు. ఎలా అయితే ప్రజలను బుట్టలో వేసుకోవచ్చన్న అంశంపై ఆయన చాలా రోజులుగా కసరత్తు చేసినట్టు తెలుస్తోంది. ప్రగతిభవన్ వీడకుండా ఇన్నాళ్లూ ఊరిస్తూ వచ్చారు.



అద్భుతమైన మేనిఫెస్టో తీసుకుని వస్తాం.. కాచుకోండని కేటీఆర్, హరీష్ రావులు ప్రకటిస్తూ వచ్చారు. చివరకు కాంగ్రెస్‌ను మించిన హావిరీలను గుప్పించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విజయవంతంగా అమలు అవుతున్న పథకాలను బేరీజు వేసుకుని అమలు సాధ్యమయ్యే పథకాలను తీసుకొచ్చామని ప్రకటించారు. ఇప్పటికే రెండు విడతలుగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలోని కొన్ని అంశాలను ప్రకటించింది. వాటిపై విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఆ పథకాలు జనాల్లోకి బాగానే చేరుకున్నాయి. అందుకే దానికి దీటుగా ఉండేలా కేసీఆర్ తన మార్క్ మేనిఫెస్టోను విడుదల చేశారు. మొదటిసారి తెలంగాణ పునర్‌నిర్మాణం పేరుతో అధికారం చేపట్టిన కేసీఆర్, రెండోసారి అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను ప్రకటించారు. మూడోసారీ అదే పంథాను అనుసరిస్తున్నారు.

## 'అసైన్డ్'కు ఎసరు..

ఇందులో తాజాగా మరో దారుణ విషయం ప్రకటించారు. అసైన్డ్ భూముల అమ్మకాలను తెరపైకి తెచ్చారు. అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలను ఎత్తేస్తామని నిర్లజ్జగా ప్రకటించారు. నిజానికి అసైన్డ్ భూముల లక్ష్యాన్ని దెబ్బతీసేలా ప్రకటన చేశారు. ఇంతకాలం దళితులకు ఇచ్చిన భూములు వారు వ్యవసాయం చేసుకుని బతకాలని ఉద్దేశించారు. ఇప్పుడా లక్ష్యం దెబ్బతీసే ప్రయత్నంలో కేసీఆర్ అడుగు వేశారు. అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేత అన్నదాని వెనక పెద్ద కుట్ర దాగి ఉంది. ఇప్పుడు ఆ భూముల కోసం గద్దల్లా రియల్టర్లు కాచుకుని ఉన్నారు. ఇప్పటికే వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ క్రమంలో రియల్టర్లకు మేలు చేసే లక్ష్యంతో అసైన్డ్ భూముల విషయంలో వెసులుబాటు కల్పించాలన్న ఆలోచన చేశారు. కొన్ని చోట్ల రాళ్లు గుట్టలు ఉన్నా ఆ భూములకు కోట్ల రూపాయల డిమాండ్ ఉందని కేసీఆర్ స్వయంగా చెప్పడమే ఇందుకు నిరద్శనం. అలాంటి భూములు అమ్ముకుని మరోచోట పదెకరాల వరకు కొనుక్కోవాలి. కానీ తమకు అలాంటి సదుపాయం లేదని, దాన్ని రిలీవ్ చేయాలని దళిత సోదరులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులతో మాట్లాడి దళితులకు హక్కులు కల్పించే ప్రయత్నం చేస్తాం. మామూలు పట్టాదారుల్లా హక్కులు కల్పిస్తామని ప్రకటించారు. దీనివెనక ఉన్న కుట్రలను ప్రజలు గుర్తించాలి. రాష్ట్రంలో భూముల ధరలను సాకుగా చూపి..పెత్తందార్లకు వాటిని కట్టబెట్టే ప్రయత్నాలకు తెరతీసారు. వీటితో పాటే అన్యాక్రాంతం అయిన దేవాలయ భూములను కూడా ఇక అమ్మకాలకు పెట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. రాష్ట్రంలో దళితులకు దళిత బంధు ప్రకటించి వారిలో ఆశలు రేపారు. ఇప్పుడు అసైన్డ్ భూముల అమ్మకాలకు అడ్డురామని చెప్పారు. ఇప్పుడు ఇచ్చిన హావిరీలను అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో అమలు చేస్తామంటూ వారిలో ఆశలు లేపారు.

## తడిసి మోపెడు..

కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలో రూ.400కే సిలిండర్లు, డబుల్ ఇళ్లు, ఆసరా పెన్షన్లు ఇలా అన్నీ కలిపి తడిసి మోపెడు కావడం ఖాయం. ఇప్పటికే తెలంగాణ బొక్కసం బోర్లా పడింది. జీతాలు కూడా సమయానికి ఇవ్వడం లేదు. ఈ పథకాలు వస్తే ఇక అడుక్కోవడం తప్ప చేసేదేవిరీ లేదు. బీమా పథకాలు, కళ్యాణలక్ష్మి మొత్తాన్ని పెంచడం, పెన్షన్లు పెంచడం, రైతుబంధు మొత్తం పెంచడం వంటివి తప్ప కొత్తగా చేసేదేమిటో అర్థం కాదు. ఇప్పటికే కిలో రూపాయి బియ్యం పథకం పక్కదారి పట్టి ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ప్రజలు కట్టిన పన్నులతో కేవలం కిలో రూపాయికే సన్నబియ్యం అందిస్తామని చెప్పడం ద్వారా మరింత దుబారాకు తెరతీసే ప్రయత్నాలు చేపట్టారు. దానికి అన్నపూర్ణ అన్న పేరు పెట్టారు. వచ్చే ఏప్రిల్ నుంచి తెలంగాణ అన్నపూర్ణ పథకం కింద సన్న బియ్యం ఇస్తామని ప్రకటించారు. ఈ పేరుతో కిలో బియ్యం పథకం మరింత భారం కావడంతో పాటు, మరిన్ని అక్రమాలకు తెరతీస్తుందనడంలో సందేహం లేదు.

## కాంగ్రెస్‌ను తిడుతూ..

కాంగ్రెస్‌ను తిడుతూ అవే పథకాలను ప్రకటించడం దౌర్భాగ్యం కాక మరోటి కాదు. చివరకు అసైన్డ్ భూములను అమ్మే స్థితికి ప్రభుత్వం వచ్చింది. రైతు బంధు పథకం ఇప్పుడున్న పదివేలను పదహారు వేలకు పెంచుకుంటూ పోతామన్నారు. రూ.12 వేల నుంచి మొదలు పెట్టి రూ.16 వేలకు తీసుకెళ్తామన్నారు. అందులో దుబారాను అరికట్టే ప్రయత్నం చేయాలన్న తపన ఎక్కడా కనబడ లేదు. బియ్యం పథకం, ఉచిత విద్యుత్ పథకం, పెన్షన్లు, అసైన్డ్ భూముల అమ్మకంలో ఉన్న అవినీతిని అరికట్టకుండా వాటికి అండగా నిలిచేలా చేస్తున్న పథకాల అమలుతీరు బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట.

## జర్నలిస్టులపై సవతి తల్లి ప్రేమ..

అక్రిడేటెడ్ జర్నలిస్టులకు సైతం రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందించాలని నిర్ణయించినట్లు కేసీఆర్ ప్రకటించారు. గత తొమ్మిదన్నరేళ్లుగా జర్నలిస్టులకు గజం రూపాయికే జాగాలు ఇస్తామంటూ ఆశ పెట్టారు. సుప్రీం తీర్పు వచ్చి ఏడాది దాటినా దానిని అమలు చేయకుండా సవతి తల్లి ప్రేమ వలకబోస్తున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ బజారున పడింది. పరీక్షలు సక్రమంగా నిర్వహించలేక నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇవన్నీ ఎలా సరిచేస్తారో చెప్పకుండా తెలంగాణలో కోరుకున్న అభివృద్ధి జరగడం లేదన్న విషయం తెలిసినా.. రాజకీయాలు చేస్తూ పోతున్నారు. ప్రజలను మభ్యపెట్టడం నేర్చుకున్నారు. ఇలాంటి పథకాలతో అధికారం దక్కించుకోవడం సులువు. ప్రజలు కూడా పథకాలకు రుచి మరిగారు కాబట్టి ఓట్లేస్తారు. కానీ రాష్ట్రం మాత్రం ముందుకు వెళ్లదని గుర్తించాలి.

# హైవేలపై దోపిడీ ముఠా అరెస్ట్

**పోలీసుల అదుపులో ముగ్గురు**

**వరంగల్ వాయిస్, క్రైం :** హైవే రహదారులపై దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల దొంగల ముఠాను హసన్ పర్తి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలలోకి వెళితే పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామానికి చెందిన టీ కొట్టు కూలి తాటికొండ యశ్వంత్, కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దారంగుల అంజి కొంత కాలంగా హనుమకొండలోని పద్మాక్షి కాలనీలో నివాసముంటుండగా, బాలసముద్రం అంబేద్కర్ నగర్ కు చెందిన కార్ డ్రైవర్ కుమ్మరి రాజేష్ ముగ్గురు ముఠాగా ఏర్పడి గత మూడు నెలల నుంచి హైవేపై రాత్రి వేళ పల్సర్ బైక్ పై సంచరిస్తూ లారీలను ఆపి, నిద్రిస్తున్న వారిపై విచక్షణ రహితంగా దాడి చేసి వారి వద్ద ఉన్ననగదు, స్మార్ట్ ఫోన్స్ లను చోరీ చేస్తున్నారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి సీఐ గోపి ఒక స్పెషల్ టీంను ఏర్పాటు చేసి 24 గంటల్లోనే దోపిడీ ముఠాను పట్టుకున్నారు. వీరు గత రెండు నెలల పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్నటువంటి కోమటిపల్లి టోల్ ప్లాజాదగ్గర నిద్రిస్తున్న ఒక లారీలోకి వీరు అక్రమంగా ప్రవేశించి దాని అద్దమును కట్ చేసి అందులో నిద్రిస్తున్న డ్రైవర్ పాకెట్ ని కట్ చేసి రూ.35వేలతోపాటు స్మార్ట్ ఫోన్ దొంగిలించారు. డ్రైవర్ నిద్రలేచి అరవడంతో అతడిపై రాళ్లతో దాడి చేసి అక్కడి పరారయ్యారు. ఈ ఘటనలో డ్రైవర్ కు తీవ్ర గాయాలు కాగా, మరో దోపిడీ చింత గట్టు ప్రదేశంలో చేశారు. మరో సంఘటనలో టోల్ గేట్ ఓఆర్ఆర్ బ్రిడ్జిపైన ఇంకొక లారీని ఆపి అతనిని కొట్టి స్మార్ట్ ఫోన్ తోపాటు రూ.30వేల క్యాష్ దొంగిలించారు. ఈ మేరకు ముగ్గురు నింధితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# దోపిడి పాలన అంతమే.. ఉద్యమకారుల పంతం

**తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సబ్బండ వర్గాల పోరాటం, త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో అన్ని వర్గాలను మోసం చేసిన కల్వకుంట్ల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని, వారి పాలనను అంతం చేయడమే ఉద్యమకారుల పంతం కావాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ పుల్లూరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. కేసీఅర్ దుష్ట పాలనకు వ్యతిరేకంగా గత రెండు సంత్సరాల నుంచి పౌర సమాజం పోరాటం చేస్తోందన్నారు. ఆ సంఘాలతో కలిసి తెలంగాణ ఉద్యమ వేదిక ఐక్య ఉద్యమాలు చేస్తుందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబ నిర్ణయమే ప్రజాస్వామ్యమైందని, కుల ఆధిపత్యంలో రాష్ట్రం దోపిడీకి గురైందన్నారు. అలాంటి దుష్ట పాలనను గద్దె దించడానికి వ్యక్తి



పాలనకు బిన్నమైన ప్రజాస్వామిక కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలిచిన తర్వాత తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా గతంలాగానే తప్పులు చేస్తే మరో విప్లవం పెల్లుబికితుందన్నారు. 90 శాతం ప్రజలు బీఅర్ఎస్ పార్టీని ఓడించాలని చూస్తున్నారన్నారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేయడలో ఆరితేరిన కేసీఆర్ కుట్రల పట్ల పౌర సంఘాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవినీతి దోపిడి పాలన పట్ల నిరుద్యోగులను, మహిళలను, రైతులను, ప్రజలను చైతన్యం చేయడానికి ఉద్యమకారులు గ్రామాలకు తరలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, సోమ రామమూర్తి, సాయిని నరేందర్, చింతకింది కుమారస్వామి, బనుక సిద్ధిరాజ్ యాదవ్, అకినపల్లి వెంకటేశ్వర్లు, చిల్ల రాజేంద్రప్రసాద్, యాదగిరి చారి, పటేల్ వనజ, సద్గుణ, సుమలత, కోండ్ర నర్సింగరావు, కూనూరు రంజిత్ గౌడ్, రాచకొండ ప్రవీణ్ కుమార్, నున్న అప్పారావు, ముంజాల భిక్షపతి, చాపర్తి కుమారస్వామి, మంద వీరస్వామి, తాడిషెట్టి క్రాంతి, డాక్టర్ కె.వీరాస్వామి, సాంబరాజు మల్లేష్, చేపూరి ఓదెలు, సంజీవ, బొనగాని యాదగిరి గౌడ్, నలిగింటి చంద్రమౌళి, రాజ్ మహ్మద్, నల్లెల రాజయ్య, పిట్టల శ్రీను, ఆకు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మేర జేఏసీ కన్వీనర్‌గా గూడూరు సుమన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేర కులస్థుల హక్కుల కోసం నిరంతరం ప్రశ్నించే గొంతుక తెలంగాణ రాష్ట్ర మేర జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునిగాల రాము, వ్యవస్థాపక అధ్యక్షుడు సంగ వెంకటరాజం, రాష్ట్ర కో-కన్వీనర్ కీర్తి జయంత్ హనుమకొండలోని వేద కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మేర కులస్తుల ఆత్మీయ సమావేశంలో వరంగల్ జిల్లా మేర జేఏసీ కన్వీనర్ గా గూడూరు సుమన్ ను, ప్రధాన కార్యదర్శిగా గట్ల నరేందర్, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి రమేష్, కీర్తి ఉదయ్, ఆడప సురేష్, జాయింట్ సెక్రెటరీగా అడప రజితను నియమించి తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా అన్ని రకాలుగా వెనుకబడ్డ కుల వృత్తి మీద ఆధారపడ్డ మేర కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి చేర్చాలని, ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా వరంగల్, హనుమకొండ జిల్లాలలో మేర కులస్తులకు శిక్షణ కార్యక్రమాలు, భవనాలు ఏర్పాటు చేయాలని, వరంగల్, హనుమకొండ జిల్లాలలో ఏర్పాటు చేస్తున్న టెక్స్ టైల్ పార్కులలో మేర కులస్తులకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా నియమించబడ్డ వరంగల్ జిల్లా మేర జాక్ కన్వీనర్ సుమన్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర మేర జాక్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మేర కులస్తుల హక్కుల కోసం నిరంతరం ప్రశ్నిస్తూ ముందుకు వెళ్తానని తెలియజేశారు. ఈ సమావేశంలో వివిధ మేర కులస్తులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములపై అందరికీ హక్కులు ఇవ్వాలి

### ఏబీఎస్ అధ్యక్షుడు కలకోటి మహేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా అసైన్డ్ భూములపై ఒక స్పష్టమైన నిర్ణయం వెల్లడించలేదని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు కేవలం దళితులకు మాత్రమే లేవని, అన్ని కులాల వారికి, అన్ని మతాల వారికి ఉన్నాయని కలకోట మహేందర్ పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాలకే అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్నాయని, సెన్సెస్ కూడా చెప్తున్నాయని ఈ విషయంలో ముఖ్యమంత్రికి అవగాహన లేదని ఆయన పేర్కొన్నారు.అసైన్డ్ భూములకు హక్కులు ఇస్తే మొదటగా బాగుపడేది బీసీ సామాజిక కులాలని ఆయన స్పష్టం చేశారు. దళితుల చేతుల్లో అసైన్డ్ భూములు రెండవ స్థానంలో ఉన్నాయని మొదటగా బీసీ కులాల అత్యధికంగా కలిగి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆలోచించి అన్ని కులాల వారికి న్యాయం చేకూరే విధంగా అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2020లో ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడమే కాకుండా ఇప్పుడు ఎన్నికల ఎజెండాగా ముఖ్యమంత్రి మార్చుకున్నారని కలకోటి మహేందర్ న్యాయవాది పేర్కొన్నారు. అసైన్డ్ భూముల సమస్యను రాజకీయ అంశంగా కాకుండా సన్న, చిన్న కారు రైతుల ఆవేదనగా చూడాలని , మానవ హక్కులుగా పరిగణించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఎజెండా కాకుండా ఎన్నికలకు ముందే అసైన్డ్ భూములపై హక్కులు వచ్చే విధంగా ఏదైనా ఆర్డినెన్స్ తీసుకొని రావాలని కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడం పాలకుల హామీగా మిగిలిపోవడం సహజంగా జరిగిపోతుందని ఆయన పేర్కొన్నారు.

## మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా విల్సన్ మాదిగ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి మాదిగ సూచన మేరకు ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేష్ కుమార్ మాదిగ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామానికి చెందిన జేరిపోతుల విల్సన్ మాదిగకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం జారీ చేస్తూ ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విల్సన్ మాదిగ మాట్లాడుతూ నాపై నమ్మకంతో, ఈ కీలకమైన జిల్లా బాధ్యతలు అప్పగించిన బీఎన్.రమేష్ కుమార్ మాదిగ, జాతీయ, రాష్ట్ర జిల్లా నాయకులకు అభివందనలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామంచ సారంగపాణి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల కుమార్ మాదిగ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రపు శ్యామ్, వరంగల్ జిల్లా మీడియా కన్వీనర్ దాసరపు సారన్న మాదిగ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మామునూరు భాస్కర్ మాదిగ, వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి రాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు జేరిపోతుల కరుణాకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా పాలన

### ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట నియోజకవర్గ నూతన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. మరొక సారి నిజాయితీగా పని చేసిన నాకు అవకాశం ఇవ్వండని కోరారు. నా సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ఏమి ఆశించకుండా పనులు చేశానన్నారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలు రేవూరిని రెండు సార్లు గెలిపించిన, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు. ప్రతిసారీ రెండు పార్టీల నాయకులు ఒక్కటవుతున్నారని విమర్శించారు. పార్టీలు వేరైనా వారి ఇద్దరు నాయకులు ఒక్కటేనన్నారు. నేను గత ఎన్నికల్లో గెలిచిన, 2014 ఎన్నికల్లో ఓడిన కూడ నిత్యం ప్రజల్లో ఉన్నానన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే వస్తున్నారు. కరోనా కాలంలో కూడా ఏ ఒక్క నాయకుడు కూడా నియోజకవర్గానికి రాలేదన్నాడు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వాళ్ల కార్యకర్తలు చనిపోయిన కూడా రాని వారు ఇవ్వాళ వచ్చి మాటలు మాట్లాడుతున్నారని పెద్ది మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని పథకాలు నియోజకవర్గానికి తీసుకురావడం జరిగిందన్నారు. నియోజవర్గంలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే నాకు మళ్లీ ఒకసారి అవకాశం ఇవ్వండని ఆయన కోరారు. రాజకీయాలకు అతీతంగా పాలన చేశాను. రాజకీయ కక్షలు కూడా జరగకుండా చూశామన్నారు. కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చమన్నారు. నియోజకవర్గంలో 450ఎకరాల భూమిని దళితులకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేసీఆర్ అందరికీ ఆమోదయోగ్యమైన మేనిఫెస్టో రూపొందించారు. రానున్న రోజుల్లో నర్సంపేట నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టో ప్రవేశపెడతామన్నారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 09వ డివిజన్ ఐకే గార్డెన్ లో డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలపై మహిళా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్లమెంట్ అబ్జర్వర్ ఉత్తమ్ రావు డాల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రస్తుతం కేవలం ఒక కుటుంబానికే లబ్ది జరిగిందన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలు చూసి చలించిన తెలంగాణ తల్లి సోనియా గాంధీ ఆరు పథకాలను ప్రవేశపెట్టారని, కాబట్టి మీరు అందరూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి నవంబర్ 30న జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మహిళలను కోరారు. మహిళా శక్తీ అండగా ఉంటే ఎంతటి యుద్ధంనైనా గెలవొచ్చని, కాబట్టి మహిళలు అందరూ సోనియా గాంధీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ని ప్రజలు నాలుగు సార్లు ఓట్లు వేసి గెలిపిస్తే తను ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి తనని రాబోయే ఎన్నికలో పశ్చిమ ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాలలో తోడు ఉంటానని తెలిపారు. ఈ నియోజకవర్గంలో తన సొంత నిధులతో ఒక్క కార్పొరేట్ స్థాయి హాస్పిటల్, ఒక్క స్కూల్ ఏర్పాటు చేసి ఉచితంగా విద్య, వైద్యం అందిస్తానని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారం లో వచ్చిన తరువాత గ్యాస్, పెట్రోల్ నిత్యావసర ధరలను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసారని, మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెడ్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికలో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయుకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయుకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కె.శశాంక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. ఈ తనిఖీ లో భాగంగా సోమవారం కలెక్టర్ కె శశాంక జిల్లాలోని మహబూబాబాద్ నియోజకవర్గం పరిధిలోని గూడూరు-నర్సంపేట భూపతిపేట సరిహద్దు ప్రాంతం, కేసముద్రం-ఇనుగిర్తి కోరుకొండపల్లి సరిహద్దు ప్రాంతం, నెల్లికుదురు-తొర్రూర్ జంక్షన్ సరిహద్దు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పలు చెక్ పోస్టు కేంద్రాలను ఎన్నికల ప్రత్యేక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలకు గమనించి గంటకు ఎన్ని వాహనాలు వెళుతున్నాయి, అందులో ఫోర్ వీలర్లు, టూ వీలర్లు, ట్రాన్స్ పోర్ట్ వాహనాలకు సంబంధించిన రిజిష్టర్ ను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. చెక్ పోస్ట్ ల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, స్టాటిక్ సర్వేయలెన్స్ అధికారులు ప్రతీ వాహనాన్ని వీడియోగ్రఫీతో తనిఖీ నిర్వహించాలని, వాహనాల తనిఖీ, జప్తు చేసినటువంటి నగదు, ఇతర సమాచారానికి సంబంధించిన రికార్డు సమాచారాన్ని, నిర్దిష్ట ఫార్మాట్ లలో సంబంధిత అధికారుల ద్వారా రోజువారీగా ఆర్వోకు పంపించాలని, ఆర్వో వాటిని పరిశీలించి భద్రపరచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జప్తు చేసిన వాటికి రశీదు ఇవ్వాలన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు మౌలిక సదుపాయాలను సమకూర్చాలని అన్నారు. రాత్రి సమయాలల్లో పలు జాగ్రత్తలతో తనిఖీలు నిర్వహించాల్సిందిగా ఎన్నికల సిబ్బందికి సూచించారు. దసరా పండగ సెలవుల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేపట్టాలని, డబ్బు, మద్యం, రవాణాను అరికట్టాలని అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్ లను తనిఖీ చేసి నివేదికలను పంపివ్వాలని, ఫంక్షన్ హాళ్ల యజమానుల వివరాలు, ఫంక్షన్ హాళ్లలో ఏదైనా కార్యక్రమానికి సంబంధించి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కు అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డీఎస్పీ టి.సత్యనారాయణ, ఎన్నికల ఆర్వో/ ఆర్డీఓ ఎల్.అలివేలు, ఎంసీసీ నోడల్ అధికారిణి నర్మద, గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు తహసీల్దార్లు అశోక్, సూర్యనారాయణ, రాజు స్టాటిక్ సర్వేలయన్స్ అధికారి శోభన్, చైతన్య పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రవళిక కుటుంబానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

## కుర్సా అధ్యక్షుడు తాళ్లపల్లి నరేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దుగ్గొండి మండలం బిక్కజి పల్లి గ్రామానికి చెందిన నిరుద్యోగిని మర్రి ప్రవళిక పోటీ పరీక్షల వాయిదాల వలన తీవ్ర మనస్థాపానికి గురై హైదరాబాదులో ఆత్మహత్య చేసుకుంది. దీనిపై బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సానుభూతి చూపి, ఆ కుటుంబానికి అండగా నిలబడి ఆదుకోవాల్సిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆమె ఆత్మహత్యపై నిరాధారమైన అబండాలు వేసి, గ్రూప్ -2కు ప్రవళిక అసలు అప్లికేషన్ కూడ పెట్టుకోలేదని అబద్ధాలతో కూడిన తప్పుడు స్టేట్మెంట్ ఇచ్చి ప్రవళిక ఆత్మ శోభించేలా వారి కుటుంబం పరువు తీసేలా వ్యాఖ్యానించిన కేటీఆర్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొవాలని కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా) అధ్యక్షుడు తాళ్లపల్లి నరేష్ డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబానికి క్షమాపణలు చెప్పి, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని వివేకానంద రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ లో స్కాలర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లపల్లి నరేష్ మాట్లాడుతూ విద్యార్థి, యువత పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల ఖారా?నాగా మార్చి వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించలేని అసమర్థ కేసీఆర్ ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పాలించే నైతికత లేదన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన కేసీఆర్, నేడు తెలంగాణ సమాజాన్ని, విద్యా రంగాన్ని, యువతను మోసం చేసేందుకు మరో మేనిఫెస్టోతో ముందుకు వస్తున్నాడని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలోని విద్యార్థి, యువత కేసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోరాట మార్గాన్ని ఎంచుకోవాలి కానీ ఆత్మహత్యలు చేసుకోవద్దని పిలుపునిచ్చారు. గత శనివారం మర్రి ప్రవళిక స్వగ్రామంలో వారి కుటుంబానికి న్యాయం చేయాలని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు కలిసి విద్యార్థి సంఘాల నాయకులపై అకారణంగా భౌతిక దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బాధ్యత వహించాలని, దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భౌతిక దాడులకు పాల్పడిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12నియోజకవర్గాల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు బస్సుయాత్ర నిర్వహించి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడ కొట్టడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ మాదాసి రమేష్, ఇట్టబోయిన తిరుపతి యాదవ్, సంపత్, వడ్డేపల్లి మధు, తూము విజయ్ కుమార్, విష్ణు, సాంబశివ, నిమ్మల సోమరాజు, బి.నరసింహారావు, పి.జానకి రామ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల అమలు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తామని నర్సంపేట మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ అన్నారు. మండలంలోని ముగ్ధంపురం గ్రామంలో ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదేలు ఆధ్వర్యంలో గడపగడప కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబర్ 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతిమాధవ రెడ్డి గెలుపు కోసం గడపగడపకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఇటీవల తుక్కుగూడ వేదికగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజులు లోపు ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు తెలంగాణ ప్రజలకు ప్రజలు ఉద్యమకారులకు నిరుద్యోగులకు కోరుకున్న పాలనను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు ఇస్లావత్ నారాన, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి, వార్డు మెంబర్ వెల్దండి భారతి మధు, మాజీ వార్డ్ నెంబర్ రాయపూడి మల్లికాంబ కోలా సావిత్రి , జన్ను రవి, రమేష్, నాయకులు కొమ్ముకట్టయ్య, బండారి సతీష్, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కివి పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరీమాబాద్ ప్రాంతంలో గల కివి పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మూడో రోజు బతుకమ్మ సంబరాలు పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపక బృందం, పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసి రజని పాల్గొన్నారు.

## సిరులు కురిపిస్తున్న జననీ సీడ్స్ పత్తి విత్తనాలు



**వరంగల్ వాయిస్, లింగాల ఘనపురం:** మండలంలోని రెడ్డి పురం గ్రామంలో గాదె బాల సౌ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జననీ సీడ్స్ వారి సర్కార్ బిజీ2 పత్తి విత్తన ప్రదర్శన క్షేత్రాన్ని నిర్వహించారు. తన 6ఎకరాలలో వేసిన పత్తి వెరైటీ సర్కార్ బిజీ2 పత్తి ప్రదర్శన క్షేత్రాన్ని వివిధ గ్రామాల నుంచి 500మంది రైతులు సందర్శించారు. సర్కార్ పత్తి పంటను చూసిన రైతులు చాలా బాగుందని చెట్టుకు 80 నుంచి 90 కాయలు వరకు ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జననీ సీడ్స్ కంపెనీ జోనల్ మేనేజర్ పూల శివ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు సర్కార్ బిజీ 2 విత్తనం కాయ సైజు లావుగా ఉంటుందని, ఎటువంటి బెట్ట పరిస్థితులను అయినా తట్టుకుంటుందన్నారు. రానున్న కాలంలో రైతులు జననీ సీడ్స్ వారి సర్కార్ విత్తనాలు వాడి అధిక దిగుబడులు పొందాలని రైతులకు చెప్పారు. మా జననీ సీడ్స్ కంపెనీలో మరో రెండు రకాలు ఆకాష్ బిజీ-2, జైకిసాన్ బిజీ -2విత్తనాలు కూడా ఎంతో మేలు చేసే రకాలని రైతులకు వివరించారు. సర్కార్ బిజీ పంటను చూసిన రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ సుదర్శన్ ఫెర్టిలైజర్స్ డిపో వేణు, ప్రవీణ్ రెడ్డి, ఆర్ఎం వాస శంకర్రావు, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రేగొండ, గీసుకొండ, పర్వతగిరి, శాయంపేట మండలాలలోని వివిధ గ్రామాలలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ననేల పునరుత్పాదక ప్రాజెక్ట్ అమలు విధానంపై శనివారం, ఆదివారం అంతర్జాతీయ సెమినార్ ను ఐ డీ హెచ్, బీసీఐ(బెటర్ కాటన్ ఇనిషియేటివ్)సంయుక్తంగా నిర్వహించారు. ఈ అంతర్జాతీయ సెమినార్ కార్యక్రమానికి శాయంపేట మండలంలోని వసంతపూర్ గ్రామానికి చెందిన కోసరిగోపాల్ హాజరై బీసీఐ వారి ఆర్థిక, డబ్ల్యూ డబ్ల్యూఎఫ్-ఇండియా సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్నటువంటి బీసీఐ, హెచ్ ఎం ప్రాజెక్టు కార్యక్రమాల గురించి అనుభవాలను వివరించారని ప్రాజెక్టు మేనేజర్ వై.ఇన్నారెడ్డి తెలిపారు. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సెమినార్ లో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కోసరి గోపాల్ ను నియమితులై గత 12 సంవత్సరాల నుంచి అమలు చేస్తున్న ప్రాజెక్టు కార్యక్రమాల గురించి సెమినార్ లో అందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీఐ, ఐడీహెచ్, డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్-ఇండియా ప్రతినిధి బృందం, అంతర్జాతీయ వివిధ ఎన్జీవోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నన్నపునేనికి బీ-ఫామ్ వచ్చిన సందర్భంగా ర్యాలీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19 డివిజన్లో సోమవారం కార్పొరేటర్ ఓనిస్వర్ణలత భాస్కర్ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ కు బీఫామ్ ఇచ్చిన సందర్భంగా కృతజ్ఞతగా కాశిబుగ్గలో మోటర్ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి ఆర్టీఏ నెంబర్ గోరంటల మనోహర్, ఉమా మహేందర్, వేముల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో జోరుగా చేరికలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు మండలం వెలికట్టే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుమారు 250మంది పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మేకల కుమార్, సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంగళరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు రవి నాయక్, మహిళా కాంగ్రెస్ శాఖ బ్లాక్ అధ్యక్షురాలు ఉష, మండల మహిళా అధ్యక్షురాలు ప్రశాంతి, పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీగా పోటీ చేసిన అభ్యర్థి మలోతు సునీత రాజేందర్, వార్డు సభ్యులు భాస్కర్ రాజు, పబ్బల రాము, దీకొండ సరిత, వెంకట సాయిలు, కుమార్, సంజీవ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీ-ఫామ్ తీసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కు బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ లో బీఫామ్ అందజేశారు. కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకున్న రెడ్యానాయక్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజారపు సుమన్‌కు బెస్ట్ ఫోటో గ్రాఫర్ నేషనల్ అవార్డు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** పలువురు ప్రముఖులకు వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ గా పనిచేసిన రాజారపు సుమన్ బెస్ట్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ జాతీయ అవార్డును ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ)నేషనల్ కాన్ఫరెన్స్ లో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కాన్ఫరెన్స్ ఢిల్లీ లోధి రోడ్డులోని ఆంధ్ర అసోసియేషన్ లో అవార్డుల ఫంక్షన్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ కు ముఖ్యఅతిథులుగా ఢిల్లీ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి రాజ్ కుమార్ ఆనంద్, స్థానిక ఎమ్మెల్యే విషెష్ రవి, కాన్షిరాం ఫౌండేషన్ చైర్మన్, కాన్షిరాం సోదరి స్వరన్ కౌర్ హాజరై అవార్డులు అందుకున్న వారిని, అవార్డులు అందజేస్తున్న బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడిని అభినందించారు. అనంతరం బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఈ అవార్డులను అందజేస్తున్నట్లు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :**మండలంలోని పెద్దమడూరు గ్రామం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రుద్రోజు భాస్కరా చారి ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గం నాయకురాలు ఝాన్సీ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ వీడి నారెడ్డి లక్ష్మయ్య, చిర్రా రవి , నారెడ్డి ఉప్పలయ్య, కర్రి సోమయ్య, ఊడుగుల యాదయ్య, మునిగొండ జీవన్, గణిపాక ప్రదీప్, పాసుగంటి భాను, మునుగొండ సందీప్, మునుగొండ అంజి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు, ఆమోద యోగ్యంగా ఉందని, కాంగ్రెస్ తోనే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రుద్రోజు పురుషోత్తం చారి, సీనియర్ నాయకులు మామిళ్ల రమేష్, భువనగిరి మారాలు, మామిళ్ల రవి, దండు ప్రభాకర్ , మధురి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రవేశపెట్టినటువంటి మేనిఫెస్టోలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రకటించిన సందర్భంగా మహాదేవ పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేత లింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ లో బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ములుకనూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాతకు నిర్వాహకులు, భక్తులు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి విశేష పూజలు అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం దుర్గామాత విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులు దుర్గామాత సేవలో నిమగ్నమయ్యారు. అనంతరం యూత్ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ అధ్యక్షుడు బైరి రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణను రజాకర్ల రాజ్యం చేసిన కేసీఆర్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** తెలంగాణను సీఎం కేసీఆర్ రజాకార్ల రాజ్యం చేశారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అధ్యక్షతన, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్లు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జీఎస్ఆర్ గార్డెన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అరాచకాలు పెచ్చు మీరు పోయాయన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఆత్మగౌరవం కోసం తెలంగాణ ను తెచ్చుకుంటే తెలంగాణ కేసీఆర్ చేతిలో బందీ అయిందని ఆయన విమర్శించారు. యువతకు ఉపాధి లేకపోగా కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. బంగారు తెలంగాణ చేస్తా అన్న కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు మయంగా చేశారని ఆయన ఆరోపించారు. టీఎస్పీఎస్సీలో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేకత నివురు కప్పిన నిప్పులా ఉందని, ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమని ఆయన అన్నారు. పరకాలలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ నిరుద్యోగి ప్రవళిక ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని దుర్మార్గంగా నిందలు మోపుతోందని ఆరోపించారు. ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వం బేషరతుగా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పైన తిరుగుబాటు మొదలైందన్నారు. వరికోల్, కొకొండ పోచారం గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేలు నిలదీయడం జరిగిందన్నారు. ఆత్మకూరు మండలంలో గడపగడపకు బీజేపీ పాదయాత్ర చేపడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, బీజేవైఎం నియోజకవర్గ కో కన్వీనర్ సాయికృష్ణ, అగ్రంపాడు మాజీ సర్పంచ్ గుల్లపల్లి వెంకన్న, పూజారి సత్యనారాయణ ,మండల ఉపాధ్యక్షులు గట్టు వేణు, పూజారి రవీందర్, మండల కార్యదర్శులు రవ్వ శివప్రసాద్, తిప్పని రాంబాబు, అల్లి మహేందర్, నన్నేబోయిన రమేష్, భయ్యా పైడి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రేవూరి రాజేందర్ రెడ్డి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కాడబోయిన సునీల్, వేముల సాయి రెడ్డి, ఓబీసీ మండల ఉపాధ్యక్షుడు మోరె రాజేశ్వరరావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ బలభద్ర దినేష్, బూత్ అధ్యక్షులు కోరుకొప్పుల ప్రశాంత్, భయ్యా మాలగం, ముత్యాల వీరస్వామి, పీసాల సాంబయ్య, శానబోయిన రాకేష్, యాద కుమారస్వామి, కొమ్ముల భద్రయ్య, మాదిరెడ్డి సురేందర్, వజ్ర రవికుమార్, పెండ్లి సుమన్, పోగుల యాదగిరి, కొన్నే రాజేందర్, నాగపురి నాగరాజు, వాడికారి రాజు, జయరాం, వాసరి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, వడోదర :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ ఉత్సవాలను ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుజరాత్ లోని వడోదరలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. హనుమకొండకు చెందిన ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ సభ్యులు గుజరాత్ టూర్‌లో భాగంగా వడోదరలో ఉన్న సందర్భంగా సోమవారం మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మను తంగేడు, బంతిపూలతో పాటు వివిధ రంగు పూలతో పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. పూలను పూజించే సంస్కృతి తెలంగాణ ఆడబిడ్డలకే ఉందని, మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశంతో బతుకమ్మ వేడుకలను నిర్వహించామని వారు తెలిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో లాంటి బతుకమ్మ పాటలలో ప్రేమ, స్నేహబంధం, కుటుంబ ఆప్యాయతలు తెలియజేస్తాయని సాంస్కృతిక విభాగం కన్వీనర్ లు సుమలత, సరళలు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ధర్మ ప్రకాష్, కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి మోహన్ రావు, టూర్ కన్వీనర్ మహేష్, ప్రచార కార్యదర్శి పరికిపండ్ల వేణు, సలహా మండలి సభ్యులు మురళి, జగదీశ్వర్, వివిధ కమిటీల బాధ్యులు సందీప్, మధు,శివ, అశోక్, సతీష్, ఇగ్నైటెడ్ మైండ్ సభ్యులు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులకు సేవారత్న నేషనల్ అవార్డు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** సీనియర్ పాత్రికేయుడు మాడుగుల రాజ్ కుమార్ అక్టోబర్ 15న న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవా రత్న నేషనల్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, కవులకు, రచయితలకు, సంఘ సేవకులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఇండియాలోని 27రాష్ట్రాల నుంచి సుమారుగా 1000మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఢిల్లీ కేబినెట్ మినిస్టర్ ఢిల్లీ సోషల్ వెల్ఫేర్ లేబర్ ఎంప్లాయిమెంట్ మినిస్టర్ శ్రీ రాజ్ కుమార్ ఆనంద్ , ఢిల్లీ అసెంబ్లీ ఎమ్మెల్యే విశేష్ రవి పాల్గొన్నారు. ఈ అవార్డు అందజేసిన వారితో పాటుగా ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు మన్వీర్ సింగ్ పచ్చ, నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం విజయ లలిత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏమేం గౌతం పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాడుగుల రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు ఇచ్చిన బహుజన సాహిత్య అకాడమీకి ధన్యవాదాలు తెలిపారు

## సొంత గూటికి చేరిన కీమా నాయక్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని బోడ మాణిక్యం తండా 3వ వార్డు మెంబర్ చించావత్ రాంధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కీమానాయక్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ లో చేరిన కీమా నాయక్ కు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కీమా నాయక్ మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటూ అప్పుల పాలు చేశాడని ఆయన ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలో కొత్తదనం ఏమి లేదని, అవన్నీ అమలుకు నోచుకోనివని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం అధికార ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి పట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భూక్య మోహన్ నాయక్, బూత్ కన్వీనర్ వెంకట్ నాయక్, భాస్కర్, భూక్య పూలు నాయక్, వాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణది

## కాకతీయ మహిళా కళాశాలలో బతుకమ్మ వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని మూడో రోజు సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినిలు, మహిళా అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలకు వచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా కళాశాల యజమాన్యం గుండా హరి నారాయణ, మట్టెవాడ మాధవ్, ఎం.రవీందర్ రెడ్డి, ఎం.దయాకర్ హాజరై






వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు, చిన్నారులకు అత్యంత ప్రీతికరమైన పండుగ బతుకమ్మ అని తెలిపారు. పువ్వులను పూజించే ప్రత్యేకతను కలిగే ఉందన్నారు. సాంస్కృతి,సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. ఆడి పాడారు. డీజే పాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈ.రామచందర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శంకరమఠంలో గాయత్రి హెూమం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ శృంగేరి శంకర మఠంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం గాయత్రి హెూమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీ సంగమేశ్వర జ్యోషి అధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, సాయి గణేష్ శర్మ, విశాల్ శర్మ, వివేక్ శర్మలు సోమవారం శ్రీ శారదాంబ అమ్మవారికి, శ్రీ చంద్రమౌళిశ్వర స్వామి కి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కాపర్తి కోటిలింగం- విజయలక్ష్మి దంపతులు గాయత్రి హెూమం నిర్వహించారు. శ్రీ శారదాంబ అమ్మవారికి మహా మంగళారతులు అనంతరం అన్నదానం జరిగింది. శ్రీ శృంగేరి సేవా సమితి సభ్యులు దేవేందర్, రామారావు, మదన్ మోహన్, రాజేంద్రప్రసాద్, రవీందర్, వంశీ, భాస్కర్, సర్వేశ్వర్, రాజు, రమాదేవి, పద్మ, కళ్యాణిలు భక్తులకు సేవలు అందించారు. అలాగే సాయంత్రం కొనే భాస్కర్ -వాసవి దంపతులు, సుహాసినీలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అన్నవజ్జుల సోమశేఖర శర్మ శ్రీదేవి భాగవతం పురాణ ప్రవచనం చేశారు. అలాగే సీహెచ్ కృష్ణవేణి చే కర్ణాటక గాత్ర సంగీత కచేరి జరిగింది.

## ఘనంగా శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహెూత్సవాలు అత్యంత వైభవంగా శైవాగమోక్తముగా బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గందె వెంకన్నతెలిపారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉ 5గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవఅనుజ్ఞ, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, ప్రధాన కళశ స్థాపన, దీక్షాధారణ, అంకురారోపణ, అఖండ దీప స్థాపన, అగ్నిప్రతిష్ఠాపన నేడు శైలపుత్రి క్రమంలో బ్రహ్మ చారిణీ శ్రీ గాయత్రి దేవిగా అలంకరించి శ్రీచక్రార్చన, నవావర్ణార్చన, విశేషోత్సవము, నిత్యోపాసన నిర్వహించడం జరిగింది. అమ్మవారిని దర్శించిన వారికి సర్వసౌభాగ్యములు కలుగుతాయని ప్రముఖ శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ తెలిపారు. రేపు అమ్మవారిని చంద్ర ఘంటా క్రమంలో శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకరించబడునన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని చైర్మన్ గందె వెంకన్న కోరారు.

## బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** చర్లపాలెం గ్రామంలో సోమవారం ఎర్రబెల్లి దయాకర్ రావు గెలుపు కోసం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం గ్రామ శాఖ అధ్యక్షుడు జినుగ అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తొర్రూరు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాములు, ఎస్ఎస్ రెడ్డి, కాకిరాల హరి ప్రసాద్, కిషోర్ రెడ్డి, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, ప్రమోద్, గ్రామ శాఖ ఇంచార్జి బిజ్జాల అనిల్, గ్రామ సర్పంచ్ సట్ల నాగలక్ష్మి, చర్లపాలెం గోపాలగిరి గ్రామాల ఎంపీటీసీ ధర్మరపు కిరణ్ లు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో దయాకర్ రావు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. మంత్ కి చెర్లపాలెం గ్రామంలో భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. అలాగే చర్లపాలెం గ్రామంలో కొన్ని కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందని. ఇంకా ముందు కూడా చాలా అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు అన్నారపు రాములు, ప్రధాన కార్యదర్శి సముద్రాల చెన్నమల్లు, మాజీ అధ్యక్షుడు సముద్రాల యాకయ్య, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## బీ-ఫామ్ తీసుకున్న ఎమ్మెల్యే చల్లా




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ లో బీ ఫామ్ అందజేశారు. కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్ అందుకున్న అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో మూడోసారి పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించి బీఫామ్ అందచేసిన సీఎం కేసీఆర్ కు, సహకరించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలందరూ బ్రహ్మరథం పట్టేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు.

## ఆశా కార్యకర్తలకు శిక్షణ తరగతులు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆశా కార్యకర్తలకు ఇంటివద్ద పిల్లల సంరక్షణ, నవజాత శిశు సంరక్షణలపై ఐదు రోజులపాటు శిక్షణా తరగతులను ఐఎంఏ హాల్ పత్తిపాక రోడ్డులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు అందరికి కూడా, శిశు సంరక్షణ చర్యలపై శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ముఖ్యంగా దీనిలో పుట్టిన పిల్లోడు నుంచి 15 నెలల వరకు చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులు, సంరక్షణ చర్యలపై, ఇంటి వద్దనే ప్రసవం అయినా వారికి ఏడు సార్లు , 1, 3, 7, 14, 21, 28, 42 రోజులలో గృహ సందర్శన చేయాలని, అదేవిధంగా హాస్పిటల్ లో ప్రసవం అయినవారికి ఆరు 3, 7, 14, 21, 28, 42 రోజుల్లో సందర్శించాలన్నారు. ఈ సందర్శనలో వయసుకు తగ్గ బరువు ఉన్నది చూడాలని, పోషకాహార లోపం, రక్తహీనత ఏమైనా ఉందా అని చూడాలన్నారు. ఏమైనా అనారోగ్య కారణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని ఆశా కార్యకర్తలకు ఈ శిక్షణ తరగతులలో నేర్పించబడుతుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, శిక్షకులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సక్కుబాయి, సరోజన, పద్మ హెల్త్ సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికలాంగుల పోస్టల్ బ్యాలెట్‌పై రాష్ట్ర స్థాయి అవగాహన

**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో సోమవారం తెలంగాణ సార్వత్రిక ఎన్నికలు - వికలాంగుల పోస్టల్ బ్యాలెట్ రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నుంచి ఎన్ పీఆర్ డీ ఇండియా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సూదమల్ల ప్రశాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇంచార్జి లాసాని నర్సింగరావు, ఆరు మండలాల ఎన్ పీఆర్ డీ ఇండియా అధ్యక్షులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాసాని నర్సింగరావు సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈసారి పోస్టల్ ఓట్లు నమోదుకావడంతో పాటు అభ్యర్థుల గెలుపోటముల్లో ఇవి కీలకపాత్ర పోషించనున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈసారి దాదాపుగా 13లక్షల మందిని పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గుర్తించారు. దివ్యాంగులు, 80ఏళు పైబడిన వారికి పోస్టల్ బ్యాలెట్ కు అవకాశం కల్పించడమే దీనికి ప్రధాన కారణం. రాష్ట్రంలో దివ్యాంగులు 5.06లక్షలమంది. గతంలో కేవలం ఎన్నికల విధుల్లో ఉన్నవారికి, సర్వీసు ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండేది. కానీ కరోనా నాటి నుంచి దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వారికి ఈ అవకాశం కల్పించారు. దీంతో పోస్టల్ ఓట్లు ఉపయోగించుకునే వారి సంఖ్య




గణనీయంగా పెరిగింది. లక్షల్లో ఓట్లు ఉండడంతో అభ్యర్థుల గెలుపోటముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ముఖ్యపాత్ర పోషించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ రాష్ట్రస్థాయి సదస్సులో హనుమకొండ జిల్లా ఎన్ పీఆర్ డీ ఇండియా(దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక) పరకాల మండల అధ్యక్షుడు బొల్లారం సంజీవ, నడికూడ మండల అధ్యక్షుడు గూడ కొమురయ్య, ఆత్మకూరు మండల అధ్యక్షుడు భిక్షపతి, దామెర మండల అధ్యక్షుడు నరసయ్య, గీసుకొండ అధ్యక్షుడు సంగీత్ తదితరులు పాల్గొన్నారు.

# అందానికే అసూయ పుట్టేలా...

## మృణాళ్ సోయగం

ఇప్పుడు కుర్రకారు జపం చేస్తున్న పేరేదైనా ఉందా..? అంటే ఒక్క క్షణం ఆలోచించకుండా చెప్పే పేరు మృణాళ్‌ఠాకూర్. ఈ మరాఠీ ముద్దుగుమ్మ లవ్ సోనియా సినిమాతో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. 2022లో సీతారామం చిత్రంలో సీతామహాలక్ష్మి (ప్రిన్సెస్ నూర్ జహాన్) పాత్రకు ప్రాణం పోసి.. తెలుగులో కూడా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది. ట్రెండీ డ్రెస్‌లోనైనా, చీరకట్టులోనైనా మృణాళ్ ఠాకూర్ సోయగానికి ఫిదా అవ్వాల్సిందే. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ వన్ ఆఫ్ ది లీడింగ్ బ్యూటీ తాజాగా బ్లాక్ ఔట్‌ఫిట్‌లో అదరగొట్టేసింది. మృణాళ్ తారక దిగొస్తుందా..? అన్నట్టుగా క్యారవాన్ నుంచి బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో నడుచుకుంటూ వస్తున్న విజువల్స్ ఇప్పుడు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం కామెడీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న హిందీ మూవీ. పరేశ్ రావల్, అభిమన్యు దస్సానీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఇలా దర్శనమిచ్చింది మృణాళ్ ఠాకూర్.





## ఎప్పటికీ గుర్తుండిపోతుంది

వెంకటేష్ నటించిన 'సైంధవ్' టీజర్ ఈరోజు విడుదలైంది. దీనికి శైలేష్ కొలను దర్శకుడు, వెంకట్ బోయినపల్లి నిర్మాత. ఇది వెంకటేష్ కి 75వ సినిమా. అందుకనే ఈ సినిమా ఒక ప్రతిష్టాత్మకంగా నిర్మించారు అని అర్థం అవుతోంది. ఇందులో వెంకటేష్ తో పాటు, శ్రద్ధా శ్రీనాథ్, ఆర్య, నవాజుద్దీన్ సిద్ధిఖీ, రుహానీ శర్మ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈరోజు విడుదలైన టీజర్ చాలా ఆసక్తికరంగా వుంది. ఈ టీజర్ లో ఈ సినిమా కథని కొంత వరకు చెప్పగలిగారు అని తెలుస్తోంది. నవాజుద్దీన్ సిద్ధిఖీ మాదక ద్రవ్యాలు సరఫరా చేయడమే కాకుండా, చిన్న పిల్లలకి శిక్షణ ఇచ్చి వాళ్ళని సంఘ వ్యతిరేక శక్తులుగా కూడా తయారు చేస్తూ ఉంటాడు. ఆలా చేస్తున్న ఈ ముఠాని అడ్డుకునేందుకు వెంకటేష్ రంగంలోకి దిగుతాడు అని అర్థం అవుతోంది. అంతే కాకుండా ఈ సినిమా నేపథ్యం చిన్న పిల్లలతో కూడి ఉండటం, వెంకటేష్ కుమార్తె కూడా ఉండటం, ఇందులో భావోద్వేగాలకు కూడా చాలా ప్రాముఖ్యం ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ టీజర్ లాంచ్ ఈవెంట్ లో వెంకటేష్ మాట్లాడుతూ చాలా కాలం తరువాత తను ఒక సినిమాతో వస్తున్నాను అని, ఇది ఒక మంచి సినిమా అని చెప్పాడు. దర్శకుడు శైలేష్ కథ చెప్పగానే, ఇది కొంచెం వైవిధ్యం తో ఉండటం వలన, వెంటనే ఒకే చెప్పేసాను అని చెప్పారు వెంకటేష్. తన సినిమాలు 'చంటి', 'కలిసుందాం రా', 'లక్ష్మి' అవన్నీ సంక్రాంతి పండగకి విడుదలయ్యి పెద్ద విజయం సాధించాయని, ఇప్పుడు మళ్ళీ 'సైంధవ్' తో సంక్రాంతికి వస్తున్నాను అని చెప్పారు. అలాగే తన మొదటి సినిమా నుండి ఇప్పుడు 75వ సినిమా వరకు ఆదరిస్తున్న తన అభిమానులకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సినిమా చాలా బాగుంటుంది అని, పండగకి అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారు అని, చాలా సంవత్సరాల తరువాత ఒక యాక్షన్, భావోద్వేగాలు కల సినిమా చేస్తున్నాను అని, ఇది అందరికీ నచుతుంది అని అనుకుంటున్నాను అని చెప్పారు వెంకటేష్. ఈ సినిమా ముందుగా డిసెంబర్ 22న విడుదల చెయ్యాలని అనుకున్నారు, కానీ ఆ సమయంలో ప్రభాస్ నటించిన 'సలార్' వస్తుండటంతో ఈ సినిమాని సంక్రాంతికి అంటే జనవరి 13న విడుదల చేస్తున్నారు.

## నాకు అంతగా సెలక్షన్ రాదు



మహేష్ బాబు, అతని భార్య నమ్రత ఇద్దరూ ఎప్పుడైనా ఒకేసారి మీడియా ముందుకు రావటం మొదటి సారిగా ఈరోజు జరిగింది. జూబిలీ హిల్స్ లోని తమ స్నేహితుల డిజైనర్ షాప్ ఓపెన్ చెయ్యడానికి ఇద్దరూ కలిసి రావటం ఇదే మొదటి సారి. ఆ విషయం స్వయంగా మహేష్ బాబు చెప్పారు. నేను ఈరోజు మహేష్ ని కూడా రమ్మని చెప్పి అతన్ని కూడా ఇలా ఈ ఫంక్షన్ కి ఈరోజు తీసుకు వచ్చాను అని చెప్పారు నమ్రత. ఈ సంర్భంగా మాట్లాడుతూ నమ్రత కి ఎప్పుడైనా మీరు ఏమైనా బట్టలు కొన్నారా అంటే, మహేష్ బాబు ఏమని సమాధానం ఇస్తారో అందరూ ఆతృతగా ఎదురు చూస్తుంటే, అతను షాకింగ్ సమాధానం ఇచ్చారు. "లేదు, నేను ఎప్పుడూ కొనలేదు. ఎందుకంటే నాకు అంతగా సెలక్షన్ రాదు. ఇంకా చెప్పాలంటే, నా బట్టలు కూడా నమ్రత నే షాపింగ్ చేస్తుంది. నేను చెయ్యను అన్నీ తనే చూస్తుంది," అని చెప్పారు మహేష్ బాబు. అయితే ఇదేమి తన బ్రాండింగ్ లో పార్టు కాదని, కేవలం స్నేహితుల కోసం ఈ షాపు ఓపెనింగ్ కి వచ్చామని చెప్పారు. ఇక సినిమా విషయం చెప్పాలంటే మహేష్ బాబు 'గుంటూరు కారం' షూటింగ్ లో బిజీగా వున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదలవుతుంది. ఇందులో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయకులు, ప్రకాష్ రాజ, రమ్య కృష్ణ, రావు రమేష్, మురళి శర్మ, బ్రహ్మాజీ మున్నగు వారు నటిస్తున్నారు.

## 'నేను చేస్తున్న వీడియోలు ఎవరినీ ఉద్దేశించినవి కావు

పెళ్లి తర్వాత హీరోయిన్గా కాస్త స్లో అయ్యారు బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ రెండేళ్ల గ్యాప్ తర్వాత ఆమె 'బ్లైండ్' అనే సినిమాలో నటించింది. ఆ చిత్రం ఈ ఏడాది జూలైలో విడుదలైంది. అప్పుడప్పుడు తనపై విమర్శలు వస్తుంటాయి. వాటిపై ధీటుగా స్పందిస్తుంటారు సోనమ్. తాజాగా ఆమె ఓ యూట్యూబర్‌కు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తన కుటుంబం గురించి హాస్యాస్పదమైన వ్యాఖ్యలు చేసినందుకు ఓ యూట్యూబర్‌కు ఆమె నోటీసులు పంపారు. సోనమ్ కపూర్ ఆమె భర్త ఆనంద్ అహూజా కాస్ట్యూమ్స్ బ్రాండ్ల గురించి రాగిణి అనే యూట్యూబర్ ఓ వీడియో చేశారు. అందులో ఆ దంపతుల గురించి ఆమె కామెడీగా మాట్లాడారు. ఇది సోనమ్ దాకా చేరడంతో వెంటనే సదరు యూట్యూబర్‌కు లీగల్ నోటీసులు పంపారు. ఈ మొత్తం విషయంపై యూట్యూబర్ వివరణ ఇచ్చింది.
"నా వీడియో కింద ఎప్పుడూ ఒక నోట్ ఉంటుంది. 'నేను చేస్తున్న వీడియోలు ఎవరినీ ఉద్దేశించినవి కావు. నాకు ఎవరిపై ద్వేషం ఉండదు. ఇది కేవలం వినోదం కోసం మాత్రమే' అని ఆ నోట్లో ఉంటుంది" అని రాగిణి అన్నారు. దీనిని సీరియస్‌గా తీసుకోవడం కరెక్ట్ కాదు' అంటూ విమర్శిస్తున్నారు. మరో నెటిజన 'పెద్ద షోల్లో ఎలాంటి కామెంట్స్ చేసినా నవ్వుతారు. ఈ ఇష్యూ తర్వాత రాగిణి ఛానల్ ఉన్న 7 వేల మంది సబ్ స్క్రిప్షన్ ఒక్కసారిగా 37 వేలకు పెరిగింది.






# మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగింది

## ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్
## ప్రారంభమైన ప్రజా ఆశీర్వాదయాత్ర

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రతిపక్షాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడినే ఎన్నుకుంటారన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నిన్న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ తీసుకోవడం జరిగిందన్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా నాకు అన్ని రకాలుగా మనోధైర్యం ఇస్తూ నా గెలుపులో భాగస్వాములై పనిచేస్తున్న ప్రతి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు సభాముఖంగా ధన్యవాదాలు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు ఎంతో విశ్వాసంతోని నన్ను ఆశీర్వదిస్తున్నారన్నారు. పార్టీ మేనిఫెస్టో విడుదల చేయగానే ప్రజలందరూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు. వారి బతుకుల్లో వెలుగు నింపేందుకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని గడప గడపకు తీసుకెళ్లవలసినటువంటి బాధ్యత ప్రతి ఒక్క బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకవైపు అభివృద్ధి మరొకవైపు సంక్షేమంతో దేశంలో ఎక్కడా లేని పథకాలను తీసుకొచ్చినటువంటి ఘనత మానవతావాది కేసీఆర్ కే దక్కుతుందన్నారు. నిన్న విడుదల చేసిన మేనిఫెస్టో ముఖ్యమంత్రి భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాగా భావించాలన్నారు. 2018 ఎలక్షన్ సమయంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కానీ పథకాలను మేనిఫెస్టోలో పెట్టినా ప్రజలు నమ్మలేదన్నారు. మూడోసారి రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీకి అధిక సీట్లు వస్తాయనే ధీమాను వ్యక్తం చేశారు. నిరుపేదలకు, జర్నలిస్టులకు రూ.400లకే గ్యాస్ అందిస్తామన్నారు.

### నేటి నుంచే ప్రజా ఆశీర్వాదయాత్ర..

నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ లో సోమవారం నుంచే ప్రజా ఆశీర్వాదయాత్ర ప్రారంభించినట్లు వినయ్ భాస్కర్ ప్రకటించారు. మొదటి రోజు 59, 60 డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ప్రభుత్వంలో ఉన్నటువంటి బీఆర్ఎస్ పార్టీ పైన అనేక విమర్శలు చేస్తున్నారని, ప్రజలు వాటిని గమనిస్తున్నారన్నారు. ప్రజలకు కష్టమొచ్చినా నాయకుడిని కాపాడుకుంటారే తప్ప, ఎన్నికల్లో మాత్రమే కనబడే వ్యక్తిని గుర్తించరన్నారు. ఒక నాయకుడు గడియారాలు పంచవచ్చు, మరొక నాయకుడు కుక్కర్లు పంచి ప్రజలను మభ్య పెట్టవచ్చు కానీ ప్రజలు తమకు పని చేసే నాయకుడిని ఎన్నుకుంటారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైనటువంటి వారందరికీ కూడా బీమాను పెంచడం జరిగిందన్నారు. అసైన్డ్ భూములు కలవారికి పట్టాలు ఇస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష పార్టీలకు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నాయకులు శివ శంకర్, ఈగ మల్లేశం, కేశవరెడ్డి, సంపత్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, సోనీ, రవీందర్ పాల్గొన్నారు.

# పరకాల కాంగ్రెస్ టికెట్ ఎవరికి..!

## వేగంగా మారుతున్న పరిణామాలు
## టికెట్ ఆశిస్తూ పార్టీలో చేరిన మాజీ నక్సల్స్‌కు అవకాశం లభించేనా
## తెరపైకి రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు రోజురోజుకు వేగంగా మారుతున్నాయి. ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నా కాంగ్రెస్ అందుకు అనుగుణంగానే వేగంగా పావులు కదుపుతోంది. అభ్యర్థులు వీక్ గా ఉన్న స్థానాల్లో కొత్త అభ్యర్థులను తెరపైకి తెస్తూ అధికార పార్టీని అయోమయానికి గురిచేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల అసెంబ్లీ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీ పెద్ద లిస్టు తయారు చేసింది. ముందుగా ఇక్కడి నుంచి పోటీలో ఉంటారనుకున్న ఇనగాల స్థానంలో మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు అలియాస్ గాజర్ల అశోక్ పేరు తొలుత తెరపైకి తీసుకొచ్చింది. అంతా పరకాల సీటు అశోక్ కు కేటాయిస్తారనుకుంటున్న సమయంలో మాజీ మంత్రి రేవూరి ప్రకాష్ రెడ్డి పేరు తెరపైకి రావడంతో పరకాల సీటు ఎవరికి కేటాయిస్తారనేది ఉత్కంఠ నెలకొంది. ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు కూడా టికెట్ ఆశిస్తుండడంతో టికెట్ ఎవరికీ కేటాయించాలనే సందిగ్ధంలో కాంగ్రెస్ పార్టీ పడినట్లు సమాచారం. అన్ని అంశాలను బేరీజు వేసుకొని చూస్తున్న ఆపార్టీ మాజీ నక్సల్ ను బరిలోకి దింపుతుందో లేక సీనియార్టీకి పెద్దపీట వేస్తుందో చూడాలి. గతం నుంచే పావులు కదుపుతున్న కొండ మురళీధర్ రావు, ఇటీవలే పార్టీలో చేరిన మాజీ నక్సలైట్ గాజర్ల అశోక్ తాజాగా తెరపైకి వచ్చిన రేవూరి ప్రకాష్ రెడ్డి.. ఈ ముగ్గురి పేర్లు పరకాల నియోజకవర్గం రేసులో కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో ఉండగా టికెట్ ఎవరిని వరిస్తుందో అనే సస్పెన్స్ నెలకొంది.

### బీజేపీకి బిగ్ షాక్..

బీజేపీ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ నెల 18న రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే రేవూరి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనకు మరల వరంగల్ పశ్చిమనియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం ఇస్తారా..? లేకుంటే పరకాలనుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారా అన్న సస్పెన్స్ కొనాసగుతోంది. గత ఎన్నికల్లో పశ్చిమలో రేవూరికి 46వేల పైచిలుకు ఓట్లు సాధించారు.

# అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీశరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం బ్రహ్మచారిణి, సాయంకాలం దేవజా దుర్గా క్రమంలో పూజారాధనలు చేశారు. ఉదయం మకర వాహన సేవ, సాయంకాలం చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ దంపతులు, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని బి-ఫారంను అమ్మవారి చెంత పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ లక్ష్మిబాబు, పారిశ్రామిక వేత్త హృదయ్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పూజానంతరం ప్రముఖులకు మహదాశీర్వచనం నిర్వహించగా అసిస్టెంట్ కమిషన్, ఆలయ ఈఓ శేషుభారతి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి ప్రసాదాలను అందజేశారు.

# భద్రకాళి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గులాబీ దళపతి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బి-పామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా, పార్టీ ముఖ్య నాయకులతో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి బైక్ ర్యాలి నిర్వహించారు.

# అమలు కానీ హామీలతో కేసీఆర్ మేనిఫెస్టో

## బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి పదేండ్లైనా ఒక్క కొత్త రేషన్ కార్డుకూడా ఇవ్వలేని ఘణత కేసీఆర్ దని బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆరోపించారు. అప్పటినుంచి పేద కుటుంబాలకు ఎందుకు రేషన్ కార్డు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే కొత్త రాగాన్ని ఎంచుకోవడం కేసీఆర్ కు కొత్తేమీ కాదన్నారు. ఇన్నీ రోజులు రూ.400 లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు వివరించాలన్నారు. గత పది సంవత్సరాలుగా చేయని పథకాలను ఇప్పటి నుంచి చేస్తానంటూ తెలంగాణ ప్రజలను మరో మారు దోపిడీ చేసేందకు కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. లక్ష ఉద్యోగాలంటూ అసెంబ్లీ సాక్షిగా చెప్పి ఒక్క పరీక్షను కూడా క్రమ పద్ధతిలో నిర్వహించలేకపోయావ్ అంటూ ఆరోపించారు. హిందూగాళ్లను బొందుగాళ్లు అంటావ్, మాకు పెన్షన్లతో బిక్షం వేసి మా పిల్లలకు చదువు, ఉద్యోగాలు ఇవ్వకుండా తాగుబోతు తెలంగాణ చేసిన ఘనత కేసీఆర్ దే అన్నారు. తాగి అన్నదమ్ములు, రైతన్నలు చనిపోతే వాళ్ల భార్యలకు బిక్షం పేరుతో పెన్షన్ ఇయ్యడం సమంజసమా అంటూ ప్రశ్నించారు. కేబినెట్ లోని పదువులన్ని మీరే తీసుకోండి.. అలాగే ల్యాండ్ పూలింగ్ పేరుతో రాష్ట్రంలోని భూములన్ని లాక్కోండి అన్నారు. మీరు మైకు పట్టుకుంటే మిమ్మల్ని మించిన నాయకుడు ప్రపంచంలోనే లేడు అన్నట్లుగా మాట్లాడుతారు. మీరు చెప్పే మోసపూరిత మాటలు మానుకోవాలంటూ హితవు పలికారు.

# ఆరు గ్యారెంటీలతో అధికారం 'హస్త'గతం : దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**వరంగల్ వాయిస్, కాటారం:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీములతో అధికారాన్ని చేజిక్కించుకుంటామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, ఏఐసీసీ కార్యదర్శి, మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్ లో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సుదీర్ఘంగా ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com